పన్నుచెల్లింపు లేదు.. అయినా ప్రకటనల హోరు

- ఔటర్ రోడ్డుకు ఇరువైపులా హోర్డింగులను నిలిపివేసిన గత సర్కారు
- కొత్త సర్కారు నుంచి ఇంకా రాని ఎలాంటి ఉత్తర్వులు


ఔటర్ రహదారి పక్కనే ఉన్న హోర్డింగ్

శంషాబాద్: ఔటర్ రింగురోడ్డుకు ఇరువైపులా హోర్డింగులను అధికారులు ఏడాదిన్నర కిందట నిషేధించారు. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో ఔటర్‌కు ఇరువైపులా బఫర్‌జోన్‌లో ఉన్న హోర్డింగులను తీసివేయాల్సిందిగా సంబంధిత యజమానులకు సూచించారు. దీంతో కొందరు యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు వాటిని పూర్తిగా తొలగించగా, మరికొందరు వాటిపై ప్రకటనలు వేయకుండా ఆపేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నాలుగైదు నెలలుగా హోర్డింగులపై మళ్లీ ప్రకటనలు, యాడ్స్ యథాతథంగా కొనసాగుతున్నాయి. అప్పట్లో వీటి నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అధికారులు పన్ను వసూలు చేసేవారు. గతేడాదిగా ఔటర్ రహదారికి ఇరువైపులా ఉన్న హోర్డింగుల నుంచి పన్ను వసూలు నిలిపివేశారు వాటిని కొనసాగించి పన్ను వసూలు చేయాలా..? లేదా హోర్డింగులను గత ప్రభుత్వ ఆదేశాల మాదిరిగానే తొలగించాలా అన్న స్పష్టత ప్రభుత్వం నుంచి లేదని మున్సిపాలిటీ అధికారులు పేర్కొంటున్నారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 86 యూనిపోల్స్, హోర్డింగులున్నాయి. వీటి నుంచి ఏటా కోటి రూపాయల పన్ను వసూలు చేస్తున్నారు. ఇందులో ఔటర్ రహదారికి ఇరువైపులా ఇరవై ఉన్నాయి. వీటి నుంచి ప్రస్తుతానికి ఎలాంటి పన్ను రాకున్నా నిర్వాహకులు మాత్రం హోర్డింగులపై యాడ్స్ వేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. దీనిపై రాష్ట్ర సర్కారు తీసుకునే నిర్ణయం మేరకు చర్యలుంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

భారీ వృక్షం నరికివేత



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ రహదారిపై ఉన్న భారీ వృక్షాన్ని ఆదివారం కొందరు నరికేశారు. దీంతో స్థానికులు జీహెచ్ఎంసీతోపాటు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. బుద్వేల్ పాత మున్సిపల్ ఆఫీస్ నుంచి కిష్టమ్మగుట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై గతంలో రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు చెట్లను నాటారు. ఇప్పుడవి ఏపుగా పెరిగాయి. తమ ఇళ్లకు అడ్డుగా ఉన్నాయని కొందరు వాటిని తొలగిస్తున్నారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారు సైతం చెట్లు అడ్డుగా ఉన్నాయంటూ మొదళ్ల నుంచి నరికి వేస్తున్నారు. గతంలో స్థానికులు అటవీ శాఖ అధికారులతోపాటు జీహెచ్ఎంసీ అధికారులకు చెట్లు నరికేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అటవీ శాఖ చెట్లు నరికినవారికి జరిమానా విధించింది. ఆదివారం భారీగా పెరిగిన వృక్షాన్ని కొందరు మొదళ్ల నుంచి నరికివేసి మొద్దులతో పాటు కట్టెలను గంటల వ్యవధిలో తరలించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. యూనివర్సిటీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, చింతల్‌మేట్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు, సులేమాన్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.


బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం కరెంటు సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

- మిలట్రీ–2 ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు సన్‌సిటీ, పీఅండ్ టీ కాలనీ, ఏబీసీడీ, స్పెషల్ బ్లాక్స్, విశ్వాస్ టౌన్
- హిమాయత్‌సాగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు అన్వర్ హౌస్, రత్నకుమార్ వెంచర్, అప్పా టోల్‌గేట్
- దర్గా ఫీడర్ పరిధిలో 3.30 నుంచి 5 గంటల వరకు హిమాయత్‌సాగర్ గ్రామం, అప్పా మెయిన్ రోడ్డు, ఎస్ఎంఆర్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో మరమ్మత్తుల కారణంగా కోతలు విధిస్తున్నామన్నారు.
- మైలార్‌దేవ్‌పల్లి: వివిధ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మైలార్‌దేవ్ పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొగల్స్ కాలనీ, మైలార్‌దేవ్ పల్లి, లాల్‌బహదూర్ నగర్, ప్రగతి కాలనీ, బృందావ్ కాలనీ, టాటానగర్,
- మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు పల్లె చెరువు ఇండస్ట్రియల్ ఏరియా, తమిళ్ బస్తీ, ఆలీనగర్, వినాయక్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీ, హరిజన్ బస్తీ, ఎంఎం కాలనీ, ప్యాలెస్ వ్యూకాలనీ, అన్మోల్ గార్డెన్, అహ్మద్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

టైరు పేలి ట్రాలీఆటో బోల్తా

- ప్రమాదం తప్పించబోయిన ప్రైవేట్ బస్సు, కారు
- పలువురికి గాయాలు.. ఔటర్‌పై గంటపాటు ట్రాఫిక్‌జాం


టైర్ పేలడంతో పల్టీ కొట్టిన లోడ్ ఆటో


చెల్లాచెదురుగా పడిన ఇటుకలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హిమాయత్‌సాగర్ ఔటర్‌రింగ్ రోడ్డుపై వెళుతున్న ఇటుక లోడ్ ట్రాలీ ఆటో టైరు పేలడంతో పల్టీ కొట్టింది. దీని వెనుకాలే వేగంగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఈ ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు ట్రాక్‌లో వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ట్రాక్ వెంట వస్తున్న కారు సైతం బస్సును ఢీ కొని ధ్వంసమైంది. ఈ సంఘటనలో బస్సుతోపాటు ట్రాలీ డ్రైవర్, కారులోని ప్రయాణికులు గాయాలకు గురయ్యారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఔటర్ గుండా శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళుతోంది. ఇటుకలోడ్‌తో వెళ్తున్న ట్రాలీఆటో హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే ముందటి టైరు పేలిపోయింది. దీంతో వాహనం కాస్తా పల్టీ కొట్టడంతో ఇటుకలన్నీ ఔటర్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ట్రాక్ వెంట వస్తున్న ప్రైవేటు బస్సు డ్రైవర్‌ను ఆటోను తప్పించేందుకు పక్కకు మళ్లించాడు. దీంతో వేగంగా ఉండటంతో బస్సు కాస్తా డివైడర్‌లను ఢీకొంటూ ఆగిపోయింది.

30 మంది ప్రయాణికులకు గాయాలు

ఈ ఔటర్‌పై జరిగిన ఈ ప్రమాదంలో 30 మంది బస్సు ప్రయాణికులు స్వల్ప గాయాలకు గురయ్యారు. బస్సు ఒక్కసారిగా టర్న్ తీసుకోవడంతో వెనుకాలే ఇన్నోవా కారులో వస్తున్న వారు సైతం దానిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఇందులోని నలుగురు గాయాలకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ట్రాలీ డ్రైవర్ మల్లేష్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనతో ఓఆర్‌ఆర్‌పై గంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

టీఎన్జీవోస్ కాలనీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు


స్వామివారికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకుడు సామిత్రి నారాయణ

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ సాలగ్రామ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం నుంచి 7వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణచార్యులు, సామిత్రి నారాయణచార్యులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


విద్యుత్ కాంతులతో కాటేదాన్ వెంకన్నగుట్ట

ఉదయం, సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను తిలకించి తీర్థ ప్రసాదాలను సేవించారు. ఈ కార్యక్రమాలు మరో నాలుగు రోజులు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

సేవతోనే సంతృప్తి


మణికొండలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన వీఆర్‌ఫర్‌యూ సంస్థ ప్రతినిధులు

మణికొండ: మనకు ఉన్నదాంట్లో కొంత సమాజానికి ఖర్చు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తే అవి ఎంతో తృప్తినిస్తాయని మణికొండ వీ ఆర్ ఫర్ యూ అనే స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.బాపూజీ, ప్రధానకార్యదర్శి డి.సీతారాందాస్ అన్నారు. వారి సంస్థ తరఫున ఆదివారం మణికొండలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయో వృద్ధులమంతా సంస్థగా ఏర్పడి ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్, సంస్థ సభ్యుడు కె. రామకృష్ణారెడ్డి, సభ్యులు బి.ప్రదీప్‌రావు, సాంబశివరావు, ఎస్. రామసుబ్బయ్య, ఎస్. నాగేంద్రరావు, రంగాచారి, నాగభూషణం, మంజు అగర్వాల్, లక్ష్మణ్, కాంతారావు, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆనంద పోయెట్రీ’ అధ్యక్షుడిగా నీలేష్‌ప్రసాద్


ఆనంద పోయెట్రీ నూతన కార్యవర్గం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద పోయెట్రీ గేటెడ్ కమ్యూనిటీ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నీలేష్ ప్రసాద్ దూబేను ఎన్నుకున్నారు. ఆదివారం గేటెడ్ కమ్యూనిటీలో సంక్షేమ సంఘం కార్యవర్గం సమావేశం జరిగింది. ఉపాధ్యక్షులుగా ఎ.పురుషోత్తం, కె.సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా డి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా యోగేష్ ప్రసాద్ దూబే, సత్యానంద, కోశాధికారిగా జె.రవీందర్, సంయుక్త కోశాధికారిగా కోటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా ఆయూబ్ మహ్మద్, పి.సూర్యతేజ, రంజిత్ కుమార్, కె. సత్యనారాయణ, ప్రదీప్ పట్నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న వారికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికే రోడ్లు, మంచినీటి కనెక్షన్‌లను సాధించామన్నారు.

ఎయిర్‌పోర్టు కాలనీ అసోసియేషన్ కార్యవర్గం


ఎయిర్‌పోర్టు కాలనీ అసోసియేషన్‌ను సన్మానించిన దృశ్యం

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వై.సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బూడిద రమేష్‌ముదిరాజ్, రాచమల్ల గణేష్‌లను ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శి బొల్లు సంజయ్(బంటి), సంయుక్త కార్యదర్శులుగా హనుమంతు రావు, శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేష్‌యాదవ్, కోశాధికారులుగా శ్రీకాంత్‌గౌడ్, సిద్దులు ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గసభ్యులను కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు ఘనంగా సన్మానించారు.

పేదలకు అన్నదానం


పేదలకు అన్నదానం చేస్తున్న ప్రసన్న అశోక్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్ యాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు చోట్ల పేదలకు అన్నదానం నిర్వహించారు. నార్సింగి మాజీ సర్పంచ్ కె.ప్రసన్న అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో వట్టినాగుల పల్లి ఎస్ఓఎస్ అనాథ బాలల గ్రామం, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి, గోల్కొండ ఆసుపత్రి లాంటి చోట్ల వందలాది మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనతో కేకులు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తిరుమలహిల్స్ అధ్యక్షుడిగా అవినాష్


సమావేశంలో మాట్లాడుతున్న అవినాష్


మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ పి.అవినాష్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీ వాసులతో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎం.భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా సుభాష్ నారాయణ్, సంయుక్త కార్యదర్శిగా రమణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బి.అనురాధ, సౌజన్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ గతంలో రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి కాలనీలోని పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, నీటి కనెక్షన్‌ల కొరకు పూర్తిస్థాయిలో కృషి చేశామన్నారు. కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను రాబోయే రోజుల్లో పరిష్కరించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని చెప్పారు.

మత ఉద్వేగాలు పనిచేయవు: చల్లా



అత్తాపూర్: ఎన్నికల్లో మత ఉద్వేగాలు పని చేయమని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి అన్నారు. తెలంగాణలో మతం కార్డు అసలే పనిచేయదని చేవెళ్ల లోక్ సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మంచి అధిక్యంతో గెలవబోతున్నారని తమ అంతర్గత అధ్యయనంలో తేలిపోయిందని తెలిపారు. ఆదివారం ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళారం గోవర్ధన్‌రెడ్డితో కలిసి అత్తాపూర్‌లో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ 12 లోక్‌సభ స్థానాలను గెలుచుకోబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపినట్లుగానే ఈ మారు దేశ ప్రజలు బీజేపీ సర్కారును గద్దె దింపబోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీందర్‌గౌడ్, అనిల్ రెడ్డి, కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవుల ఆలయ ప్రధాన అర్చకుడి మృతి


నరసింహాచార్యులు

మణికొండ: అక్కన్న, మాదన్నలు నిర్మించిన మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు గూడ నరసింహాచార్యులు(99) శనివారంరాత్రి అనారోగ్యంతో ఇంట్లోనే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన యజుర్వేద పండితుడు, పాంచరాత్ర ఆగమాలలో విశేషకృషి చేసినందుకు చినజీయర్ స్వామి గతంలో సన్మానించారు. ఆయనతోపాటు ముగ్గురు కుమారులు ఆరు దశాబ్దాలుగా దేవాలయానికి అర్చకులుగా పనిచేస్తున్నారు. ఆయన మృతితో మంచిరేవుల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదివారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో మంచిరేవుల గ్రామస్తులతోపాటు ఆయన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాపాడకపోతే.. కనుమరుగే..!

వ్యర్థాల డంపింగ్‌తో కుంచించుకుపోతున్న చిన్నపెద్దచెరువు


గోపన్‌పల్లి-గోపన్‌పల్లి తండా మధ్యన ఉన్న చిన్నపెద్ద చెరువు వద్ద కుప్పలుగా పోసిన మట్టికుప్పలు



- ఒకవైపు కబ్జా, మరోవైపు ఇష్టారాజ్యంగా చెత్త, మట్టి డంపింగ్
- అధికారులు చర్యలు తీసుకున్నా ఫలితం శూన్యం
- కొద్ది రోజుల తర్వాత లెవలింగ్ చేసి అక్రమ నిర్మాణాలు
- ఇదీ గోపన్‌పల్లి-గోపన్‌పల్లి తండా చిన్నపెద్దచెరువు పరిస్థితి



గోపన్‌పల్లి-గోపన్‌పల్లితండా మధ్యన ఉన్న చిన్నపెద్దచెరువు వద్ద వ్యర్థాలు పారబోసి మంట పెట్టడంతో పొగ వ్యాపిస్తున్న దృశ్యం

రాయదుర్గం: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో ఏళ్ళ చరిత్ర కలిగిన నీటి వనరులను కాపాడుకోలేని దుస్థితి నెలకొంటోంది. దశాబ్దాలుగా ఉన్న శిఖం స్థలం కాస్తా రోజుకింత చొప్పున కబ్జాలకు గురికావడం రోజూ చూస్తూనే తంతుగా మారిపోయింది. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లితాండలోని చిన్నపెద్ద చెరువు పరిసరాలను చూస్తే ఇదే కనిపిస్తోంది. చెత్త, వ్యర్థాల డంపింగ్, కుప్పలు కుప్పలుగా మట్టిపోయడంతో రోజుకింత అని చెరువు కుచించుకునిపోయి ఒకప్పుడు ఇక్కడ చెరువు ఉండేదేమోనని మాట అనుకోవాల్సిన వస్తుందనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే చెరువు పరిరక్షణకు జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపడుతున్నా అక్రమార్కులు మాత్రం అధికారుల కళ్లు కప్పి యథేచ్ఛగా చెత్త, వివిధ వ్యర్థాల డంపింగ్‌ను చేస్తున్నారు. ఇది వరకు చెరువు చుట్టూరా ఫెన్సింగ్ వేసినా కొంతమంది ఆ ఫెన్సింగ్‌ను సైతం కొద్ది కొద్ది జరుపుతూ డంపింగ్‌లు చేస్తున్నారు. దీంతో చెరువు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో వ్యవహరించి చెరువులు, కుంటలు కబ్జాలపాలు కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. చెరువు చుట్టూరా మట్టి, వ్యర్థాల డంపింగ్ వేయకుండా కాపాడాల్సిన బాధ్యత మరింత చేపడితేనే వీటికి రక్షణ ఏర్పడుతుందని అందరూ భావిస్తున్నారు.


వ్యర్థాలు, మట్టి కుప్పలతో చెరువు కుంచించుకుపోయేలా..

గోపన్‌పల్లితాండలో ఎన్నో ఏళ్ళ చరిత్రకు నిదర్శనంగా ఉన్న చిన్నపెద్దచెరువు పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతోంది. చెరువు శివారులో మట్టి కుప్పలు కూడా పెద్ద ఎత్తున పోయడం నిత్యం జరిగిపోతోంది. దీనికితోడు వ్యర్థాలు, చెత్తాచెదారం వంటివాటిని కూడా డంపింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా వ్యర్థాలు తెచ్చి వాటిని దొంగ చాటున పారవేసి వాటిని ఎవరికీ తెలియకుండానే కాల్చివేసే ప్రక్రియను కూడా చేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవలి కాలంలో మట్టికుప్పలను భారీగా డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కాస్తా కుచించుకుపోయేలా చర్యలు సాగిపోతున్నాయని వీటిని ఎప్పటికప్పుడు ఆపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నా రు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసినా వాటిని జరుపుతూపోతూ మట్టికుప్పలు వేసి ఆ తర్వాత కొద్ది రోజులకు వాటిని చదును చేసి ఇళ్ల నిర్మాణం చేసేలా వాతావరణాన్ని కొందరు సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

సుందరీకరిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగం..

గోపన్‌పల్లితాండలోని చిన్నపెద్దచెరువును సుందరీకరిస్తే ఈ ప్రాంతంలో ఇటీవల వెలుస్తున్న గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ల వాసులకే కాకుండా ముఖ్యంగా స్థానికులకు ఎంతో ఉపయుక్తంగా మారడం ఉంటుంది. చుట్టూరా వాకింగ్, సైకిల్‌ట్రాక్ నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేస్తే ఎంతో మేలు చేకూరుతుంది. చిన్నపిల్లలు ఆడుకునే జోన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. చెరువులోకి వెళ్ళకుండా చుట్టూరా ఫెన్సింగ్ వేసి ఆవల ట్రాక్‌లు, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా పెద్దలు సేద తీరేలా కూర్చోవడానికి బల్లలు నిర్మాణం కూడా చేయాలని కోరుతున్నారు. అయితే గతంలో ఫెన్సింగ్ వేసినా దాన్ని పలుమార్లు జరిపారనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అలాంటివి ఇక ముందు జరుగకుండా తగిన చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


చెరువును కాపాడాలి..



గోపన్‌పల్లి, గోపన్‌పల్లితాండ మధ్య ఉన్న చెరువును అధికారులు, ప్రజాప్రతినిధులు కాపాడాలి. మేమంతా చేపలు పెంచుతూ వస్తున్నాం. చెరువు చుట్టూరా మట్టికుప్పలు, వ్యర్థాలు డంపింగ్‌లు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ, పోలీసులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఫెన్సింగ్ వేసిన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వ్యర్థాలు, మట్టి డంపింగ్‌లకు అడ్డుకట్ట వేసినట్లు అవుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టి, చెరువును పదికాలాల పాటు కాపాడేలా చూడాల్సిన అవసరం ఉంది.

– శంకరి రాజు ముదిరాజ్– ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు

చెరువే మా జీవనాధారం..



గోపన్‌పల్లి-గోపన్‌పల్లితాండ మధ్యన ఉన్న చెరువు మా జీవనాధారం. దీన్ని అందరూ కాపాడాలి. మట్టి, వ్యర్థాలు పారబోయకుండా, చెరువు కుచించుకుపోకుండా కఠిన చర్యలు చేపట్టాలి. అంతే కాకుండా చెరువు చుట్టూరా కట్టను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌గా మార్చాలి. గ్రీనరీని ఏర్పాటు చేసి ఈ ప్రాంతవాసులకు సేద తీరే ప్రాంతంగా మార్చాలి. ఆ దిశగా అధికారులు తగిన నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

– శ్రీనివాస్ గోపన్‌పల్లివాసి